

# తేలిపైన వెళ్లాం



వంగూరి నరసింహారావు

—:o:—

"వెన్నెల రాయని—వెలలేని కాంతిని" అంటూ సుమారు 18 ఏండ్ల వేశ్య బాలిక ఆ గోదావరి ఒడ్డున ఉన్న ఓదివ్య భవనంలో డాబామీద కూర్చుని వీణెయ మేళవించి హాయిగా పాడుతోంది. నాడు పూర్ణిమ. తన్ను గూర్చి పాడుతూవున్న ఆమె పాటకి పొంగిపోతూ వున్నట్లే చంద్రుడు సంపూర్ణ కళావిరాజితుడై ప్రకాశిస్తున్నాడు.

శ్యామసుందరుడు గొప్ప స్థితిపరుడు. 25 సం॥రములు వయసుంటుంది. సెమిగ్రాడ్యుయేటు. రవంత షోకిల్లామనిషి. తద్వారా కాస్తంత ఖర్చుమనిషి. "వర్తమానమే సతత మవశ్య భోగ్యమగు సంపద" అంటూ హాయిగా జీవయాత్ర నిర్విచారంగా గడుపుతున్నాడు. ఇంతవరకూ దుర్గుణా లేమీ లేవు. అదే సుగుణం. భార్య కమలం కాపురానికొచ్చి రెండేండ్లైంది. కమలం అపరూపసౌందర్యవతే కాకుండా సుగుణాల ఖని కూడాను.

ఓనాడు సాయింత్రం ఎనిమిదింటికి శ్యామసుందరుడు వేసవికాలం మూలాన్ని గాలికోసం గోదావరి ఒడ్డుకు బైల్దేరాడు. చేతికర్ర, గోల్డుఫ్లేక్ సిగరెట్లు రెండు చేతుల్ని అలంకరించాయి యథావిధిగాను. హాయిగా పచారు చేస్తున్నాడు గోదావరి ఒడ్డు రోడ్డుమీద. ఇంతలోకే ఓ తియ్యని గానం అతని కాచుట్టుపట్లనుంచి వినబడింది. వెనక్కి తిరిగి చూచాడు పరిశీలనగాను.

శ్యామసుందరుడు ఆమె పాటకీ—సౌందర్యానికీ ఆశ్చర్యపడిపోయాడు. తనివి తీగా



చూచాడామూర్తిని—కర్ణపేయంగా విన్నాడాపాటని. ఇంటికి చేరాడు రాత్రి పదింటికి.


మర్నాటినుంచి శ్యాం తత్త్వం మారింది. ఈ

సమయం కనిపెట్టి చేరాడో మాంచిస్నేహితుడు. రెండుమూడు రోజుల్లో ఆ క్రొత్త మిత్రుడు మన శ్యామ్‌ని సులాగ్గా వేశ్యాలోలుణ్ణి—కాదు గోపాల కృష్ణుణ్ణి చేసేశాడు.

ఇప్పుడు శ్యాం దినచర్య ఎట్లా మారిందంటే:—రాత్రి ఆరున్నరకే సాపాటు చెయ్యడం—అప్ టుడేట్‌గా అలంకరించుకోవడం—ఏడింటికి బైలుదేరడం—మాధురి యిల్లు చేరడం—అక్కడ నిజంగా గోపాలకృష్ణుడైపోయి విలాసంగా పది, పదకొండు, ఒక్కొక్కప్పుడు పన్నెండువరకూ కూడా గడపడం—మళ్ళీ యిల్లు చేరడం—వేరే ప్రక్క వేయించుకోవడం—శయనించటం—కలల్లో మాధురీ ప్రణయగీతాలు పలవరిస్తూనూ—మాధురీ మూర్తిని నేత్రానందకరంగా చూస్తూనూ—ఇంకా—ఇంకా నున్నూన్నూన్నూ........................

ఇల్లా గడుస్తోంది ఓ ఏడాదినుంచి. కమలం కనిపెట్టింది సగం సగంగా—యీ చర్య అంతానూ. చల్ల చల్లగా "రోజూ రాత్రేం పనుంటుంది" అని కొన్నాళ్ళు—ముందుగానే నాకరుతో "వేరే పక్కయ్యారా అయ్యగార్కి" అంటూ కొన్నాళ్ళు—"వింటున్నాను లెండి మీ కృష్ణలీలలు" అంటూ వేళాకోళంగా కొన్నాళ్ళు—ఆఖర్కి "ఇది మంచి పని కాదండీ, ఇల్లా వళ్ళూకూడా గుల్లైపోతుందండీ, ఎంతమందిని చూళ్ళేదండీ ఇల్లాగా, అన్నీ తెల్సిన మీరే ఇల్లాగైతే" అంటూ బోధిస్తూ కొన్నాళ్ళు చూచింది కమలం. ఏమీ లాభం లేకపోయింది. అవతల మేగ్నెట్టూరికే ఆకర్షించేస్తూవుంటే అతడు మాత్రం ఏంచేస్తాడు పాపం! నింపాదిగా మధుసేవలోకూడా శ్యాం ప్రథమ పాఠాలు ప్రారంభిస్తూన్నట్లు వింది కమలం. కొంచెం ఇంచుమించుగా పదివేలు దాటించాడు ఋణాన్ని కష్టపడి శ్యాం. ఇహ ఊరుకుంటే లాభం లేదనుకుంది కమలం. ఊరుకోకేం చేస్తుంది పాపం!

ఓనాడు మామూలుగా భోజనం చేశారు కమలా శ్యామ్‌లు ఒక్కసారే! శ్యాం తన టాయిలెట్టు రూమ్‌లో కెళ్ళి తయారౌతున్నాడు, మాధురీ దర్శనానికి తహతహ పడుతోను—కమలం తన టాయిలెట్టు రూమ్‌లో కెళ్ళి అతడికంటె ముందే తయారైంది ఈనాటి అసలైన స్వేచ్ఛా విహారిలాగ. అతడు వీధి గుమ్మంలోకి వచ్చాడు ప్రయాణోన్ముఖుడై అమ్మగారింటికి—



కమలంగూడా వీధి గుమ్మంలోకి వచ్చి రెండడుగులు వేసింది ముందుకి.

శ్యాం:—ఎక్కడికి వెళ్తేరావు?

క:—మీరెక్కడికి?

శ్యాం:—నే నెక్కడికైతే నీ కెందుకు?

క:—నే నెక్కడికైతే మీ కెందుకు?

శ్యాం:—అంతవరకూ వచ్చింది.........

క:—అంతవరకూ లేదు-ఇంతవరకూ లేదు. మీరు చెప్తే—నేనూ చెప్తాను.

శ్యాం:—అల్లాగా! అయితే నే నోవేశ్య యింటికి.

క:—అయితే నే నోవిటుణ్ణి చూచుకోవ డానికి.

శ్యాం:—ఈవాళే ప్రారంభమా ఏమిటి?

క:—అవును.........

శ్యాం:-(అదోవిధంగా చూస్తూ నిలబడ్డాడు.)

క:—ఏం! అల్లా చూస్తారేం! నేను చేసే పని మహా ఘోరంగా కన్పిస్తోంది కాబోలు పాపం మీకళ్ళకి. మీరు న్యాయం తెలిసినవారు. పోనీ ఎవరినన్నా సబబు అడుగుదామా ఈ విషయం అంతా చెప్పి? అంతవరకూ ఎందుకు? మీమనస్సుకే తెలుస్తుంది. బాగా ఆలోచించండి. ఏదైనా ఒకే పని మీరు చేస్తే మంచిదై, నేను చేస్తే చెడ్డ దౌతుందా? ఎవరు చేసినా మంచి మంచే! చెడ్డ చెడ్డేకదా! అందుచేత మీరు చేసే యీపని మంచిదని మీరు చేస్తున్నారు విడవ కుండా ఏకటాకీని ఏడాదినుంచి. మిమ్మి చూచి నేనుకూడా అది మంచి పనే కాబోలనుకొని యీవాళ మంచిరోజు కదా అని ప్రారంభిద్దా మనుకుంటున్నాను. ఇందులో తప్పేముంది? మీరంత వింతగా ప్రశ్నించవలసిన విశేష మేముంది? మిమ్మి లెప్పుడేనా వెళ్తూంటే ఇంత వింతగా నేను ప్రశ్నించానా? పైగా వెళ్లేవా ళ్ళని ఎక్కడికి అని అడగకూడదు అని మీ రే కదూ వెనక అనేవారు ఊరి కెళ్ళేటప్పు డెవ రైనా ఎక్కడికీ అని మిమ్మల్ని అడిగితేనూ. ఇన్నాళ్ళనుంచి మీరు వెళ్తున్నారు. ఒక్కనాడు నేను గుమ్మం దిగబోతే అప్పుడే యింత రా ద్ధాంతం ఎందుకూ? (అని ఓరగా శ్యాం మొహం కేసి చూస్తూ నిలబడింది).

*          *          *          *

దెబ్బతో తిరిగింది అబ్బాయి తత్త్వం—రైటెబౌట్ టర్న—మార్చ్—బెడ్‌రూమ్—అని కాళ్ళకి బుద్ధి చెప్పుతున్నాడు శ్యాం—తిన్నగా పడకగదిలో కెళ్లాడు. ఇన్నాళ్ళకి—ఏడాదికి—డబుల్ కాట్‌మీద శయనించాడు.

"పారింది పాచిక" అని మహాసంతోషంతో కమలం లోపలి కెళ్ళింది. తన గదిలోనే కూర్చుంది బిగువుగానూ—బెట్టు సరిగానున్నా. ఆలోచించా డాలోచించాడు శ్యాం. ఓ గంటైంది. "ఇంకా రాదేం!" అనుకున్నాడు. పిలవకపోతే లాభం లేదనుకున్నాడు. "కమలం" అన్నాడు—పలకలేదు—మళ్ళీ "కమలం" అన్నాడు. "ఆఁ, ఆఁ. పిలిచేరా? వస్తున్నాను. వెధవ నిద్ర ఇట్టే పట్టింది వాలు కుర్చీలో" అనుకుంటూ వచ్చింది కమలం.

"ఎందుకూ పిలిచారు" అని వేరే ప్రక్క సర్దుతోంది.

"ఇంకా బెట్టు సరే!" "ఎందు కా ప్రక్క సర్దుతున్నావ్."

"పడుకుందామని."

"అబ్బ! ఘొట్టుసరేమిటి? మీ మాటలేమిటో నా కర్థం అవటంలేదు. నిజంగా నిద్ర వస్తోందండీ?" అని పలుకుంది కమలం.

ఇది పనికాదని మెల్లిగా దగ్గిరకి వెళ్ళి "నాకు తగిన పాఠం చెప్పవే! కమలం!" అంటూ ఒక నిట్టూర్పు వదిలాడు.

లోకంలో సుందరీమణులందరూ తమ వేశ్యాలోలురైన భర్తలను సత్ప్రవర్తనులుగా చేసికొందురు గాక! అని ఆశీర్వదించింది—ప్రకృతి మాత—ఆ శుభ సమయంలో.

అంతటా ప్రసిద్ధికెక్కింది
ఎన్నో ప్రదర్శనాల్లో ఎన్నెన్నో బంగారు పతకాల్ని, యోగ్యతాపత్రాల్ని పొందిన

టి.టి. మిస్త్రీ ఇంగువనే దశావతారం

ఎల్లప్పుడూ పై రెండు గుర్తులను జాగ్రత్తగా చూచి కొనండి.
భారత దేశమంతటా వేనవేలు కుటుంబాలు ప్రతినిత్యం వుపయోగించి సంతృప్తిగా జీవిస్తున్నారు.
ఆహార పదార్థాలకి మంచి పరిమళాన్ని కలిగించి, ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది.
నేడే దీనిని కొని ఆనందింపుడు. అందరి వ్యాపారులవద్ద దొరకును.
1 పౌ; ½ పౌ, ¼ పౌ; 1 శేరు ప్యాకింగులలో దొరకును.

రషీద్ జెంషేడ్ సన్సు అండు కో.,
222, గోవిందప్ప నాయకన్ వీధి, జి. టి. మదరాసు.

రిపీటింగు అలారం పిస్తోలు



ఈ పిస్తోలు అపాయకరమైన సమయమునకు సహాయకారి. లైసెన్సు అక్కరలేదు. వాస్తవమైన పిస్తోలువలె గొప్ప శబ్దము గలది. దొంగిలను, దుష్ట మృగములను బెదరించుటకును ఇంకను సర్కసులలోను, నాటకపు స్టేజిలోను చాలా యుపయోగించును. దీని సైజు 6½ × 3½ గలది. 10 కేపులు ఒకేసారి పిస్తోలునందుంచి ఒకటి వెంబడి నొకటి కాల్చవచ్చును. 50 కేపులతో సహా పిస్తోలు ధర రూ. 4-8-0 మాత్రమే. డైరెక్షను నోటీసు పిస్తోలుతో పంపబడును.

ప్రత్యేకముగ 50 కేపులు ధర రూ. 1-0-0.

వెడ్‌లాక్ కంపెని, పాండ్య టౌను, మద్రాసు.